

వికలాంగులకు ల్యాప్‌టాప్‌లు


ల్యాప్‌టాప్ లను అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

ప్రజాశక్తి - కాకినాడ
సోమవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయం, స్పందన హాల్‌లో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలాక్కియాతో కలిసి నలుగురు వికలాంగులకు ల్యాప్‌టాప్‌లను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ రూ.35 వేల చొప్పున మొత్తం 1.40 లక్షల విలువైన ల్యాప్‌టాప్‌లను నలుగురికి రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ సహకారం అందజేసినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఓ శ్రీధర్‌రెడ్డి, జడ్‌పి సిఇఒ ఎన్‌వివి సత్యనారాయణ దివ్యాంగుల కౌన్సెలింగ్, రిహాబిలిటేషన్ అధికారి వై.శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.


ఢిల్లీకి బయలుదేరుతున్న కార్మిక సంఘం నాయకులతో మాట్లాడుతున్న బేబీరాణి


కాకినాడలో పరీక్షలకు వెళుతున్న విద్యార్థులు...


తాళ్లరేవులో వికలాంగ విద్యార్థి ని పరీక్ష కేంద్రానికి తీసుకొస్తున్న భవిత కేంద్రం ఉపాధ్యాయుడు...


గండేపల్లిలో పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

ఛలో ఢిల్లీకి కదిలిన కార్మికులు

ప్రజాశక్తి - సామర్లకోట
కేంద్ర ప్రభుత్వ అవలంబిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలకు నిరసనగా ఏప్రియల్ 5వ తేదీన ఢిల్లీలో జరుగుతున్న మజ్దూర్ కిసాన్ సంఘర్షణ యాత్రకు సామర్లకోట రైల్వే స్టేషన్ నుండి సోమవారం కార్మికులు పెద్దఎత్తున బయలుదేరారు.

పెద్దాపురం, తుని, పిఠాపురం, కాకినాడ ప్రాంతాల నుండి అంగన్‌వాడీ, ఆశ, మిడ్డేమీల్స్ వర్కర్స్, బిల్డింగ్ వర్కర్స్, హమాలీ, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు ఢిల్లీకి బయలుదేరిన వారిలో ఉన్నారు. ఢిల్లీకి బయలుదేరిన కార్మిక సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులకు సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షులు జి.బేబీరాణి, సామర్లకోట, పెద్దాపురం సిఐటియు ఉపాధ్యక్షులు కరణం ప్రసాదరావు, దాడి బేబిలు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బేబీరాణి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి నాయకత్వంలోని నరేంద్రమోడీ పేదల పైన భారాలు, కార్పొరేట్‌లకు వరాలు అందజేస్తోందన్నారు. కేవలం పెట్రో ఉత్పత్తులపైన ఏడాది కాలంలో 3 లక్షల కోట్లు భారాలు వేశారని, కార్పొరేట్‌లకు రూ.6 లక్షల కోట్లు రాయితీలు ఇచ్చారని విమర్శించారు. కనీస వేతనాల చట్టం అమలు చేయడంలో ఘోరా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రజలపైన దాడులు చేయడంలో కేంద్ర బిజెపి, రాష్ట్ర వైసిపిలు పోటీపడుతున్నాయన్నారు. కేంద్రం మెడలు వంచేందుకే ఢిల్లీలో మహా ర్యాలీ నిర్వహించనున్నట్లు దానిని విజయవంతం చేయడానికి బయలుదేరిన కార్మికులందరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శులు బాలం శ్రీనివాస్, డి.క్రాంతికుమార్, సత్తిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అధ్యక్ష, కార్యదర్శులు బేబి మూడి ఈశ్వరరావు, కె.ఎస్.శ్రీనివాస్, సింహాచలం, సిరిపురపు శ్రీనివాస్, నాగమణి, ఫాతిమా, అమలావతి, సూర్యకుమారి, సత్య బాలం సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు ప్రారంభం

- కాకినాడ జిల్లాలో 136 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ
- 27,889 మంది హాజరు : 197 మంది గైర్హాజరు
- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, ఆర్‌జెడి, డిఇఒ

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో ప్రశాంత వాతావరణంలో పదో తరగతి పరీక్షలు ప్రారంభమ య్యాయి. జిల్లా వ్యాప్తంగా 29,988 మంది పదో తరగతి విద్యార్థులు సోమవారం నుంచి ఈ నెల 18పరీక్షలు రాసేందుకు 136 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, మాస్ కాపీయింగ్ జరుగకుండా, పరీక్షాకేంద్రాల వద్ద విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా సకల సౌకర్యాలు కల్పించారు.

కాకినాడ కార్పొరేషన్: జిల్లాలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రారం భమయ్యాయి. మొదటి రోజు తెలుగు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. తల్లిదండ్రులు దగ్గరుండి పిల్లలను పరీక్ష హాల్కు పంపించారు. గత ఏడాది నిర్ణీత సమయం కంటే అరగంట ఎక్కువసేపు కేటాయించారు. ఈ ఏడాది నిమిషం నిబంధన వర్తింప చేశారు. ఉదయం 8.30 గంటలకే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కేంద్రాల వద్ద సందడి నెలకొంది. జిల్లా వ్యాప్తంగా 136 కేంద్రాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరీక్ష జరిగినట్లు డిఇఒ కెఎన్ పిఎస్ అన్నపూర్ణ తెలిపారు. జిల్లాలో 28,086 మంది విద్యార్థులకు గాను 27,889 మంది హాజరుకాగా 197 మంది గైర్హాజరయ్యా రని తెలిపారు. తనిఖీ అధికారులు 49 కేంద్రాలను పరిశీలించగా, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా స్థానిక సాలిపేట బాలికోన్నత పాఠశాల కేంద్రాన్ని పరిశీలించి సూచనలు చేశారు. డిఇఒ ఆరు కేంద్రాలను పరిశీలించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదని, పరీక్షల నిర్వహణకు పటిష్ఠ ఏర్పాట్లు చేయడంతో అన్ని కేంద్రాల్లోనూ ప్రశాంతంగా పరీక్షలు జరిగాయని డిఇఒ అన్నపూర్ణ తెలిపారు. కేంద్రాల్లో ఎటువంటి సమస్య లున్నా తన దృష్టికి కాని, కాల్ సెంటర్ 9000390069 ఫిర్యాదు చేయవచ్చన్నారు. **పెద్దాపురం** మండల పరిధిలో 10వ తరగతి పరీక్షలు మొదటి రోజు తెలుగు పరీక్షకు 8 పరీక్షా కేంద్రాల్లో 1547 మంది విద్యార్థులకు 1544 మంది విద్యార్థులు హాజర య్యారని, ముగ్గురు హాజరు కాలేకపోయారని ఎంఇఒ సిహెచ్ సత్యనారాయణ తెలిపారు. **సామర్లకోట రూరల్** మండల పరిధిలోని తొమ్మిది పరీక్ష కేంద్రాల్లో మొదటి రోజు పరీక్షకు 19 మంది విద్యార్థులు హాజరు కాలేదని సామర్లకోట ఎంఇఒ వై శివరామ కృష్ణయ్య తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు 177 మంది 1569 మంది ప్రైవేటు విద్యార్థులు 58 మందికి 47 మంది హాజరు కాగా 19 మంది విద్యార్థులు హాజరుకాలేనట్లు చెప్పారు. పలు పరీక్షా కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ ప్రతినిధి ఎల్.గణేష్ బాబు, కరప ఎంఎస్ఒ శ్రీనివాస రావు, సామర్ల కోట ఎంఇఒ వై.శివరామకష్ణ బందం తనిఖీలు చేసి పరిశీలించారు. **తాళ్లరేవు** మండలంలో 6 కేంద్రాలలో 1095 మందిలో 1082 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 13 మంది విద్యార్థులు హాజరు కాలేదని ఎంఇఒ ఎ.మంగాయమ్మ తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన భవిత కేంద్రాల ద్వారా మానసిక వికలాంగ విద్యార్థులకు ఆయ కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. **గండేపల్లి** మండలంలో మూడు పరీక్షాకేంద్రాల్లో 489 మందికి 481 మంది పదో తరగతి విద్యార్తులు పరీక్షలు హాజర య్యారని, ఎనిమిది మంది హాజరు కాలేదని ఎంఇఒ కె.నాయక్ తెలిపారు. **రౌతులపూడి** మండలంలో 547 మంది టెన్త్ విద్యార్థులు పరీక్షలకు హాజరు కావలసి ఉండగా 543 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని ఎంఇఒ ఎస్‌వి నాయుడు తెలిపారు. **కాజులూరు** మండలం గొల్లపాలెం, కాజులూరు, కోలంక కేంద్రాలలో 688 టెన్త్ విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా గొల్లపాలెం జడ్‌పి హైస్కూల్‌లో ఒక విద్యార్థి హాజరు కాలేకపోయారని ఎంఇఒ సత్యనారాయణ తెలిపారు. **కరప** మండలంలో ఐదు పరీక్షాకేంద్రాల్లో 894 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా ఐదుగురు మాత్రమే హాజరు కాలేకపోయారని ఎంఇఒ బి.కృష్ణవేణి తెలిపారు. కరప పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పరీక్ష కేంద్రంలో కలెక్టర్ కృతికా శుక్లా తనిఖీలు

ప్రజాశక్తి - కాకినాడ
జిల్లాలో ప్రశాంత వాతావరణంలో పదో తరగతి పరీక్షలు ప్రారంభ మయ్యా యని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. సోమవారం స్థానిక సాలిపేట నగరపాలక సంస్థ బాలికోన్నత పాఠశాలలో జరుగుతున్న పరీక్షల నిర్వహణను కలెక్టర్ కృతికా శుక్లా ఆకస్మికంగా తనిఖీ చేసి, ఏర్పాట్లను పరిశీలించి, పరీక్షకు హాజరైన విద్యార్థుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి ఏప్రియల్ 18వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరుగుతాయన్నారు. కాకినాడ జిల్లా వ్యాప్తంగా 136 పరీక్ష కేంద్రాల్లో 29,988 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు ఆమె తెలిపారు. పరీక్షలు రాసే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సెంటర్లలో పట్టిష్ట ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. పోలీస్ స్టేషన్ల నుంచి పరీక్ష కేంద్రాలకు ప్రశ్నాపత్రాల తరలింపు, తిరిగి సమాధాన పత్రాలు పోస్టాఫీస్‌కు చేర్చే క్రమంలో అధికారులు పూర్తి అప్రమత్తతో వ్యవహరించాలన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించినట్టు కలెక్టరు కతికా శుక్లా తెలిపారు. ఆమె వెంట జిల్లా విద్యాశాఖ అధికారి కెఎన్‌విఎస్ అన్నపూర్ణ, సాలిపేట మున్సిపల్ పాఠశాల చీఫ్ సూపరింటెండెంట్ సుబ్బలక్ష్మి, హెచ్‌ఎం, అధికారులు పాల్గొన్నారు.


కాకినాడ సాలిపేట పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కన్వీనర్ రాజశేఖర్

ప్రజా వ్యతిరేక విధానాలపై చైతన్య కార్యక్రమాలు

- సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం రాజశేఖర్

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి
దేశంలోనూ, రాష్ట్రంలోనూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పెద్ద ఎత్తున చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నామని సిపిఎం కాకినాడ జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ అన్నారు. 'దేశ్ కా బచావో-మోడీ హఠావో' అన్న నినాదంతో ఈనెల 14 నుంచి 30 వరకు జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో ప్రజా చైతన్య కార్యక్రమాలు జరుపుతామని చెప్పారు. కాకినాడలో పొన్న మండ రామచంద్రరావు భవన్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లా నాయకుడు టి.మధుతో కలిసి ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి రోజైన ఏప్రిల్ 14 నుంచి సీపీఎం, సీపీఐ సంయుక్తంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ రాజ్యాంగాన్ని, పార్లమెంట్‌ను పూర్తిగా అగౌరవ పరిచారన్నారు. ప్రపంచం మొత్తం అదానీ కుంభకోణం గురించి చర్చించుకుంటున్నా మోడీ ఒక్క మాట కూడా మాట్లాడలేదని ఆరోపించారు. అదానీ ఎపిసోడ్‌పై జాయింట్ పార్లమెంటరీ కమిటీని వేయాలన్న డిమాండ్‌పై కేంద్ర ప్రభుత్వం స్పందించలేదన్నారు. ప్రజాస్వామ్య స్వరాన్ని మోదీ అణిచివేస్తున్నారని తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఓ పక్క నిత్యవసర ధరలు, గ్యాస్ ధరలు పెరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. అలాగే పోలవరం ప్రాజెక్టు ఎత్తును తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ ఆపేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రయత్నించుకోవడం దారుణమన్నారు. సమావేశంలో సిపిఐ కాకినాడ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ సిపిఎం నాయకులు కె.వీరబాబు పాల్గొన్నారు.

ఒంటిపూట సెలవులపై పర్యవేక్షణ అవసరం

ప్రజాశక్తి - కాకినాడ
ఒంటిపూట సెలవులు పగడ్బందీగా అమలు చేయాలని, ప్రభుత్వం నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ చేసి చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ కాకినాడ జిల్లా కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఒంటి పూట సెలవులు ప్రకటించినప్పటికీ పాఠశాలలు నిర్వహిస్తున్న నారాయణ, తదితర పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి జి.దినేష్ కుమార్, ఎస్ఎఫ్ఐ కాకినాడ నగర ఉపాధ్యక్షులు సాహిత్‌లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాసంస్థలకు ఈ నెల మూడో తేదీ సోమవారం నుండి ప్రభుత్వ, ప్రయివేటు, ఎయిడెడ్ విద్యా సంస్థలకు ఒక పూట మాత్రమే పాఠశాలలు నిర్వహించి, మధ్యాహ్నం సెలవులు ఇవ్వాలని ఉత్తర్వులు ఆదేశించిందన్నారు. అయినప్పటీ కాకినాడ నగరంలో ఉన్న కొన్ని పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోవడంలేదని, అధికారులు పర్యవేక్షణ లేకపోవడం వల్ల ప్రయివేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధన పాటించడం లేదని కావున విద్యాశాఖ అధికారులు తక్షణమే పాఠశాలన్నింటిని పర్యవేక్షణ చేసి ప్రభుత్వ నిబంధన పాటించకుండా విద్యాసంస్థలు నడుపుతున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



కాకినాడలో నిబంధనలు పాటించని పాఠశాలలను సందర్శించిన ఎస్ ఎఫ్ఐ బృందం


స్పందనలో డిఎంహెచ్ఒపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

ఆటలుగా ఉందా..

- జీతాలివ్వకుండా ఏం పని చేస్తున్నారు
- రేపటిలోక జీతాలు ఇవ్వకపోతే
- సస్పెండ్ ఆర్డర్ మిచ్చేఆర్డర్ మీ టేబుల్ పై ఉంటుంది
- డిఎంహెచ్ఓ పైకలెక్టర్ ఆగ్రహం

ప్రజాశక్తి- కాకినాడ కార్పొరేషన్
జీతాలు ఇవ్వాలని ముందు స్పందనలో చెప్పినప్పుడు ఇప్పటివరకు ఏం చేస్తు న్నారు? స్పందన అంటే ఆటలుగా ఉందా? ఒక్కసారి చెపితే చేయా లంతే.. మళ్లీ మళ్లీ ఎందుకు తిప్పుతున్నారు.. అర్జెంటుగా డిఎంహెచ్ఒకు షోకాజ్ నోటీస్ జారీ చేయండి అంటూ కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా డిఎంహెచ్ఒ ఆర్.రమేష్‌పై తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. కాకినాడ సోమవారం కలెక్టరేట్లో నిర్వహించే స్పందన కార్యక్రమంలో కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఇచ్చిన ఫిర్యాదుపై కలెక్టర్ డిఎంహెచ్ఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు నెలలుగా జీతాలు లేకుండా పనిచేస్తున్న సిబ్బందికి జీతాలు ఇవ్వమని ముందు స్పందనలో చెప్పినప్పటికీ ఎందుకు పట్టించు కోలేదు. ఏం నాటకాలు ఆడుతున్నారా.. జీతాలవకుండా ఏంపని చేస్తున్నారు. రేపటిలోగా జీతాలు ఇవ్వకపోతే.. సస్పెన్షన్ ఆర్డర్ మీ టేబుల్ పై ఉంటుంది.. ముందుగా షోకాజ్ నోటిస్ జారీ చేయండి అంటూ కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పుడు లేనిది ఒక్కసారిగా కలెక్టర్ ఆగ్రహం చేయడంతో ఒక్కసారిగా స్పందనలో ఉన్న అధికారులందరూ అప్రమత్తమయ్యారు.

స్పందనలో సమస్యలకు సత్వర పరిష్కారం

స్పందనకు 268 అర్జీలు

ప్రజాశక్తి - కాకినాడ
స్పందనలో సమస్యలకు సత్వరం పరిష్కరం లభిస్తుందని కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలాక్కియా, డిఆర్ఒ కె.శ్రీధర్‌రెడ్డి, జడ్‌పి సిఇఒ ఎన్‌వివి సత్య నారా యణ, కెఎస్ఈజెడ్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టరు కె.మనోరమ, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి డిఎస్ సునీతలతో కలిసి ప్రజల నుంచి 268 అర్జీలు స్వీకరించారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాస్థాయి అధికారులు క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం చేసుకుని అర్జీలు పరిష్కారమయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులు పాల్గొన్నారు.

కాకినాడ కార్పొరేషన్ : కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఎస్పి రవీంద్రనాథ్ బాబు నిర్వహించిన పోలీస్ స్పందనకు జిల్లా నలుమూలల నుంచి 38 అర్జీలు వచ్చాయి. అర్జీలను సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపించి నిర్దేశిత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎస్‌పి అధికారులను ఆదేశారు. పోలీస్ స్పందన అనంతరం పోలీస్ కార్యాలయంలో అర్జీదారులకు ఉచిత భోజన వసతి సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో ఎఎస్‌పిలు పి.శ్రీనివాస్, బి సత్యనారాయణ, డిఎస్‌పిలు అంబికా ప్రసాద్, ఎం వెంకటేశ్వ రరావు, కాకినాడ ఎస్‌డిపిఒ ఇ. మురళీకృష్ణారెడ్డి, ఇన్‌స్పెక్టర్‌లు, ఎస్సైలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. **కాకినాడ కార్పొరేషన్** కార్యాలయంలో అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఒక్క అర్జీకి నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ సిటీ ప్లానర్ హరిదాసు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. **పెద్దాపురం** ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం ఆర్‌డిఒ జె సీతారామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో డివిజన్లోని పలు గ్రామాల నుండి సమస్యల పరిష్కారం కోరుతూ పది మంది అర్జీలు అందజేశారు. ఆర్‌డిఒ సీతారామారావు ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు పంపించి వెంటనే సమస్యలు పరిష్కరించి అర్జీదారులకు తెలియజేయాలని ఆదేశించారు.

రైజ్ మాడ్యూల్ ఆవిష్కరణ


రైజ్ మాడ్యుల్ ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కృతిక, జెసి ఇలాక్కియా

ప్రజాశక్తి - కాకినాడ
ఇంగ్లిష్ భాషా నైపుణ్యాల కోర్సు కోఆర్డినేటర్ గంటా ప్రసాద్ మాస్టారు, 12 మంది సబ్జెక్టు నిపుణులతో కలిసి రూపొందించిన రెడీనెస్ ఇనీషియేటివ్ ఫర్ సిచ్యుయేషనల్ ఇంగ్లిష్ (రైజ్) మాడ్యూల్‌ను సోమవారం కలెక్టరేట్ స్పందనహాల్‌లో జిల్లా కలెక్టర్ డా. కృతికాశుక్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలాక్కియా, డిఆర్ఒ కె.శ్రీధర్‌రెడ్డి, జెడ్‌పీ సిఇఒ ఎన్‌వివి. సత్యనారాయణ, ప్రసాద్ మాస్టారుతో కలిసి ఆవిష్కరించి విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పిఠాపురం నియోజకవర్గం పరిధిలోని కొంతమంది విద్యార్థులతో ముచ్చటించి, శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం పిఠాపురం నియోజక వర్గంలో రైజ్ ప్రాజెక్టు 50 ప్రాథమిక, 12 ప్రాథమికోన్నత, 32 ఉన్నత పాఠశాలల్లో విజయవంతంగా అమలవుతోందన్నారు. కలెక్టర్ ప్రత్యేక చొరవచూపి డీసీఈబీ ద్వారా రైజ్ మాడ్యూళ్లను ప్రింట్ చేయించినట్లు రైజ్ సమన్వయకర్త గంటా ప్రసాద్ తెలిపారు.

కార్టూన్ 'నిజం'



మన అసలు స్థానం
ఇది కూడా కాదేమో సార్..!!

సమన్వయంతోనే డ్రగ్స్ రహిత జిల్లా


నార్కో సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్ల

ప్రజాశక్తి - కాకినాడ
సమన్వయంతోనే కాకినాడ జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చవచ్చని, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కృతికా శుక్లా సూచించారు. సోమవారం కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో తొలి నార్కో సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా ఎస్‌పి ఎం.రవీంద్రనాథ్ బాబు, అడిషనల్ ఎస్‌పీ పి.శ్రీనివాస్, డీఆర్‌వో కె.శ్రీధర్‌రెడ్డి తదితరులతో పాటు రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ, ఔషధ, విద్య, వైద్యం, ఆరోగ్యం, అటవీ తదితర శాఖల అధికారులు హాజరయ్యారు. తొలుత అడిషనల్ ఎస్‌పీ పి.శ్రీనివాస్ ఎన్‌డీపీఎస్ చట్టం-1985 పరిధిలో జిల్లాలో నమోదు చేసిన కేసులు, గంజాయి నిర్మూలన కార్యకలాపాలు, గంజాయి అక్రమ రవాణాపై నిఘా తదితరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో కలెక్టర్ కతికా శుక్లా మాట్లాడుతూ ఉత్పత్తి, రవాణా, వినియోగం ఈ మూడు దశలపై సమన్వయ శాఖల అధికారులు పటిష్ట నిఘా పెట్టి జిల్లాలో గంజాయి, మాదక ద్రవ్యాల నిర్మూలనకు కషిచేయాలని సూచించారు. ఈ-క్రాప్ బుకింగ్ సమయంలో క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని ముఖ్యంగా సాగుచేయని భూముల్లో ఏమి పండిస్తున్నారో నిఘా పెట్టాలని సూచించారు. ప్రధానంగా సరిహద్దు మండలాలు, గ్రామాలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలన్నారు. గంజాయిని సాగు దశలోనే అడ్డుకోవాలన్నారు. ఆర్‌టీసీ.. కార్గో కార్యకలాపాలను నిశితంగా పరిశీలించాలన్నారు. మత్తు పదార్థాలు రవాణా జరక్కుండా కొరియర్ సేవల సంస్థలకూ అవగాహన కల్పించాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై పాఠశాలలు, కళాశాలల్లో అవగా హన కల్పించాలని, ఎన్‌జీవోలను కూడా భాగస్వాములను చేయాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలకు అడ్డుకట్ట వేయడంలో జిల్లా పోలీసు శాఖ బాగా పనిచేస్తోందని ఇందుకు ఆ శాఖ అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలియజేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి నెలా ఈ సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పరివర్తనతో మంచి ఫలితాలు : ఎస్‌పి రవీంద్రనాథ్‌బాబు

జిల్లా ఎస్‌పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు మాట్లాడుతూ గంజాయి రహిత జిల్లాగా కాకినాడ జిల్లాను మార్చేందుకు పోలీసు శాఖ అమలుచేసిన పరివర్తన కార్యక్రమం మంచి ఫలితాలు ఇచ్చినట్లు తెలిపారు. 2014-18లో 101 గంజాయి కేసులను నమోదు చేయగా.. 259 మందిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. అదే విధంగా 2019-23లో 176 కేసులు నమోదుచేసి, 527 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. 2019 నుంచి నిఘాను పటిష్టం చేసిన విస్తత స్థాయిలో ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టడం వల్ల అధిక కేసులు నమోదు చేయగలిగామని.. పెద్ద మొత్తంలో సీజ్ చేసి నిర్మూలించగలిగామన్నారు. ఏఎస్‌ఆర్, అనకాపల్లి జిల్లాల నుంచి కాకినాడ గుండా తెలంగాణ, మహారాష్ట్ర తదితర జిల్లాలకు గంజాయి రవాణా అవుతోందని తెలిపారు. డీఎస్‌పీల ఆధ్వర్యంలో విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రత్యేక పోస్టర్ల ద్వారా ప్రజలకు మాదక ద్రవ్యాల వినియోగం దుష్పరిణామాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కళాశాలలు, పాఠశాలలు, సచివాలయాలు తదితరాల్లో పోస్టర్లను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. జీజీహెచ్‌లో ప్రత్యేకంగా డీఅడిక్షన్, రిహాబిలిటేషన్ కేంద్రం పనిచేస్తోందన్నారు. సెబ్ టోల్‌ఫ్రీ నంబరు 14500, డయల్ 100/112 అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో కాకినాడ, పెద్దాపురం ఆర్‌డీవోలు బీవీ రమణ, జె.సీతారామా రావు, డిఎస్‌పిలు అంబికా ప్రసాద్, కె.మురళీకష్ణారెడ్డి, ఎస్.మురళీ మోహన్, బి.అప్పారావు, డీఎఫ్‌వో ఐవీకే రాజు, డిఎంహెచ్ఒ డాక్టర్ ఆర్.రమేష్, వ్యవసాయ అధికారి ఎన్.విజయ్‌కుమార్, డిప్యూటీ డిఇఒ డేనియల్ రాజు, ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు తదితరులు హాజరయ్యారు.


వరుపుల రాజా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తునన సత్యప్రభ, టిడిపి నాయకులు

రాజా ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తా

ప్రజాశక్తి - ఏలేశ్వరం
దివంగత మాజీ డిసిసిబి చైర్మన్ వరుపుల రాజా ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని ఆయన సతీమణి ప్రత్తిపాడు టిడిపి ఇన్చార్జ్ పరుపుల సత్యప్రభ అన్నారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యప్రభ మాట్లాడుతూ తన తండ్రి దాసరి నాగేశ్వరరావు ఎన్జీవో అధ్యక్షునిగా పనిచేశారని, ఉద్యోగుల సమస్యలు తెలుసని వివాహానంతరం తన భర్త రాజా ద్వారా రాజకీయాలు, ప్రజా సమస్యలపై పూర్తి అవగాహన ఉందన్నారు. నన్ను నమ్మి అధిష్టానం ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించిందని, నాయకులు కార్యకర్తలు సహకారంతో రాజా దీవెనలతో రాజకీయాల్లో కొనసాగుతానని ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సూది బూరయ్య, బస్సా ప్రసాద్, ఓలుపల్లి శ్రీకాంత్, మండపాక అలక్ రాజ్, నీలి రాజారావు తదితరులున్నారు.

నేరాలు ఘోరాలు

యానాంలో యువతి ఆత్మహత్య

ప్రజాశక్తి - యానాం

యానాం పట్టణపరిధిలో యువతి సోమవారం ఆత్మహత్యకు పాల్పడినట్టు యానాం పోలీసులు తెలిపారు. మెట్టకూరు గ్రామపరిధిలోని వంశీకష్ణ కాలనీకి చెందిన సూరిశెట్టి వెన్నెల (18) తన స్వగృహంలోనే ఫ్యాన్ చున్నీని బిగించి ఆత్మహత్య పాల్పడిందని తెలిపారు. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులు గమనించి ఆమెను యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వచ్చిన ప్పటికి అప్పటికే ఆమె మతిచెందిందని వైద్యులు ధ్రువీకరించారు. వెన్నెల యానాం డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కంప్యూటర్ ఇంజనీరింగ్ మూడవ సంవత్సరం చదువుతుందన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు గూర్చి విచారణ చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని జిజిహెచ్ మార్చురీలో భద్రపరిచినట్లు చెప్పారు.ఎస్సై శేరు నూకరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


సూరిశెట్టి వెన్నెల

మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గంలో ఆటోలో అక్రమంగా తరలిస్తున్న మ్యదాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శేరు నూకరాజు తెలిపారు. అందులో రూ.9వేల విలువ గల ఇంపీరియల్‌బ్లూ 180 ఎంఎల్ 18 బాటిల్స్ మెన్స్ ఛాయిస్ 180ఎంఎల్, 96 బాటిల్స్ ఉన్నాయన్నారు.

బైకు నుంచి జారి పడి మహిళ మృతి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండలంలోని వల్లూరు, వెదురుమూడి ఆర్ అండ్ బి రహదారిలో బైకు నుంచి జారిపడి వివాహిత మరణించింది. అంగర ఎస్ఐ బి.చంటి తెలిపిన వివరాల ప్రకారం.. రామచంద్రపురం నుంచి చింతలూరు వెళ్లేందుకు వెలుగుబంటి శిరీష (23) భర్త శ్రీనివాస్ వారి ఇద్దరు చిన్నారులతో బైకుపై బయలుదేరారు. చింతలూరు వెళ్లాల్సిన వారు వల్లూరు వైపు వెళ్లిపోయారు. విషయం తెలుసుకుని వెనక్కి వస్తుండగా వల్లూరు, వెదురుమూడి మధ్యలో బైకు గోతిలో పడింది. దీంతో శిరీష రోడ్డుపై జారి పడి తలకు తీవ్ర గాయమయ్యింది. ఆమెను మండపేట ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మరణించినట్టు వైద్యులు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చంటి తెలిపారు.

లారీ ఆటో ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-చాగల్లు

బ్రాహ్మణగూడెం ఎన్టీఆర్ విగ్రహం వద్ద సోమవారం ఆటోను క్వారీ లారీ ఢీకొని ఆటోలో ఉన్న జక్కుల జార్జి (65) మతి చెందినట్లు ఎస్ఐ సిహెచ్ వి,.రమేష్ తెలిపారు. మార్కొండపాడు గ్రామ శివారు కుంకుడిమిల్లి చెందిన ఆటోలో జార్జి నిడదవోలు బ్యాంకుకి వెళ్లి తిరిగి వస్తుండగా పంగిడి నుంచి నిడదవోలు వైపు వస్తున్న క్వారీ లారీ ఆటోను బలంగా ఢీకొనడంతో జార్జి మరణించాడు. ఆటో డ్రైవర్‌కు గాయాలైనట్లు ఎస్ఐ తెలిపారు.


నిందితునితో పోలీసులు

దమ్ము చక్రాల దొంగ అరెస్ట్

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని ఉండ్రాజవరం, పాలంగి, తాడిపర్రు గ్రామాల పరిధిలో ట్రాక్టర్ దమ్ము చక్రాల చోరీ కేసులో నిందితుని అరెస్టు చేసినట్లు ఎస్ఐ కె.రామారావు తెలిపారు. సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా కె.సావరం గ్రామానికి చెందిన కొండేటి ఆదినారాయణను అదుపులోనికి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 10 దమ్ము చక్రాలు, ఒక వ్యాన్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

250 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరంలో 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక కస్తూర్బా ఆశ్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో డాక్టర్ సత్యం రమేష్ బాబు, డాక్టర్ రాయుడు శ్రీనివాస్ పాల్గొని సుమారు 250 మంది రోగులకు వైద్యం అందించారు. అవసరమైన మందులను అందించారు. కంటి ఆపరేషన్ అవసరమైన వారికి వేమగిరి కంటి ఆసుపత్రికి పంపించారు. ఈ వైద్య శిబిరంలో సుందరపల్లి సుధాకర్, కె.శ్రీనివాస్, వై.వెంకటనారాయణ, చంటిబాబు పాల్గొన్నారు.

రామాలయాల వద్ద అన్నదానం

ప్రజాశక్తి-దేవరపల్లి

మండలంలో దేవరపల్లి, యర్నగూడెంలో సోమవారం శ్రీరామనవమి పండుగ ముగింపులో భాగంగా స్థానిక గ్రామాల్లో ఉన్న రామాలయాల వద్ద భారీ అన్నదానం నిర్వహించారు ఈ అన్నదానంలో గ్రామస్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కాకినాడలో ది కార్తికేయ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ కార్యాలయం


తమ సొమ్ములు ఇప్పించాలంటూ బ్యాంకు వద్ద కూర్చున్న డిపాజిటర్లు


బ్యాంకులో రికార్డులు తనిఖీ చేస్తున్న విచారణాధికారులు

అధిక వడ్డీ ఆశ చూపి.. డిపాజిటర్లకు కుచ్చుటోపీ

- ది కార్తికేయ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ నిర్వాకం
- 150 మంది లబ్ధిదారుల గుర్తింపు
- రూ.6 కోట్లకు పైగా బకాయిలు గుర్తించిన అధికారులు
- సుమారు రూ.10 కోట్లకు పైనే డిపాజిట్లు ఉంటాయని అధికారుల అంచనా

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కుటుంబంపై ఆధారపడకుండా వచ్చిన వడ్డీతో తను బతకాలని కాకినాడ చీడిక గ్రామానికి చెందిన లక్ష్మీ దుర్గ తన దగ్గర ఉన్నరెండు లక్షలను డిపాజిట్ చేసివచ్చిన పింఛన్‌తో బతుకుతెరువు సాగిస్తోంది. సమయం పూర్తయినతమ డబ్బులు కోసం మూడు నెలలుగా బ్యాంకు చుట్టూ తిరిగినా డబ్బులు ఇవ్వడం లేదు. అసలు సంగతి తెలుసుకుని ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేస్తోంది.

- పిల్లల చదువుతోపాటుగా, కుమార్తె పెళ్లి చెయ్యాలని తన దగ్గర ఉన్న ఆరు లక్షల పైగా సొమ్మును డిపాజిట్ చేసి మోస పోయిన కాకినాడకు చెందిన నాగేశ్వరరావు మరో కథ ఇది.

అధిక వడ్డీ ఆశ చూపి ప్రైయివేటు బ్యాంకులో డిపాజిట్లు చేసిన సుమారు 300 మందికి పైగాలబ్ధిదారుకు కుచుచ టోపీ పెట్టేందుకు సిద్ధమైన ది కార్తికేయ కో ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ వ్యవహారంపై సహకారశాఖ విచారణ చేపట్టింది. విచారణ అధికారిగా జిల్లా సహకార సొసైటీ అధికారి దుర్గాప్రసాద్ తమ సిబ్బందితో బ్యాంకుకు చేరుకుని బ్యాంకులో ఉన్న పలు పత్రాలను తనిఖీ చేశారు. దీంతోపాటుగా లబ్ధిదారులను ఎంతెంత డిపాజిట్లు చేశారో అనే దానిపై రాతపూర్వకంగా వివరాలు సేకరిస్తున్నారు. కాకినాడలో 20 సంవత్సరాల క్రితం కోది వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో కార్తికేయ కో-ఆపరేటివ్ బిల్లింగ్ సొసైటీ రిజిస్ట్రేషన్ జరిగింది. గతంలో కార్యకలాపాలు సజావుగానే జరిగేవి. కరోనా సమయంలో జయలక్ష్మి సొసైటీ బాగోతం బయటపడటంతో డిపాజిట్ దారులు తమ సొమ్ములు చెల్లించాలంటూ ఒత్తిడి తెచ్చారు. అయితే గత మూడు నెలల నుంచి లబ్ధిదారులకు బ్యాంకు నుంచి ఎటువంటి సమాధానం లేకపోవడంతో పాటుగా బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీనిలో భాగంగా విచారణ చేపట్టిన పోలీస్, సహకార శాఖ అధికారులు సోమవారం బ్యాంకుకు చేరుకుని పలు పత్రాలను తనిఖీ చేశారు.

249 సెల్‌ఫోన్ల రికవరీ

- మొబి ట్రాక్ తప్పకుండా వినియోగించుకోవాలి
- ఎస్‌పి రవీంద్రనాథ్ బాబు వెల్లడి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

దొంగలించబడ్డ ఫోన్లను మోబి ట్రాక్ కాకినాడ పోలీస్‌లు రికవరీ చేసి పోగొటుటకున్న బాధితులకు జిల్లా ఎస్‌పి రవీంద్రనాథ్ బాబు అందజేశారు. సోమవారం కాకినాడ జిల్లా ఎస్‌పి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను మోబి ట్రాక్ ద్వారా కనిపెట్టి 249 మంది బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ కాకినాడలో ఏర్పాటు చేసిన మోబి ట్రాక్ కాకినాడ పోలీస్ సేవలను కాకినాడ ప్రజలు ఎంతో సమర్ధవంతంగా వినియోగించుకుంటున్నారన్నారు. ఐటీ కోర్ టీం, సిసిఎస్ బృందాలను సమన్వయం చేసుకుంటూ, సంబంధిత పోలీస్ స్టేషన్ల సిబ్బంది సంయుక్త కృషితో సమర్ధవంతంగా ఈ సేవలను అందిస్తు న్నామన్నారు. బాధితులు పోగొట్టుకున్న ఫోనులను రూ.37,35,000 ఉంటాయన్నారు. జనవరి నుంచి ఇప్పటివరకు 339 సెల్ ఫోన్ బాధితులకు అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి శ్రీనివాస్ డిఎస్‌పిలు అంబికా ప్రసాద్, పి.మురళీకష్ణ రెడ్డి, ఐటీ కోర్ ఇన్‌సెక్టర్ పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


రికవరీ చేసిన ఫోన్‌ను అందజేస్తున్న ఎస్‌పి రవీంద్రనాథ్ బాబు

ధవళేశ్వరం నుంచి పైపులైన్ నిర్మించాలి

ప్రజాశక్తి- తాళ్లరేవు

రిలయన్స్, ఒఎన్‌జిసి సాగునీటి కోసం ధవళేశ్వరం నుంచి నేరుగా పైపులైను నిర్మించుకోవాలని దరియాల తిప్ప రైతు సంఘం మాజీ అధ్యక్షులు మల్లాడి సత్తిబాబు డిమాండ్ చేశారు. తాళ్లరేవు నీటిపారుదల శాఖ కార్యాలయం వద్ద రిలయన్స్ పంపింగ్ స్టేషన్ ఎదురుగా ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో సత్తిబాబు మాట్లాడారు. చమురు సంస్థలైన రిలయన్స్, ఒఎన్‌జిసి సంస్థల వల్ల తాళ్లరేవు మండలానికి, అటు పుదిచ్చేరి యానాంకు సాగునీటి ఎద్దడి తలెత్తుతోందని, ఈ చమురు సంస్థలు ధవళేశ్వరం నుంచి నేరుగా పైపులైన్ నిర్మించి తమ కోటాలో వచ్చిన సాగునీరు 50శాతం రైతాంగానికి ఇచ్చి, మిగిలిన సాగునీరు వాటి అవసరాలకు వినియోగించు కోవాలన్నారు. అలా కాకుండా, తాళ్లరేవు మండలం మల్లం కోట లాకుల వద్ద ఒఎన్‌జిసి సాగునీరును అన్యాయంగా తరలించక పోతుందని, సైఫాన్ తూము దాటి అతి కష్టంగా వచ్చిన మిగిలిన సాగునీరును రిలయన్స్ సంస్థ రైతుల నడ్డి విరిచి సాగునీటిని తరలించకపోతోందని అన్నారు. ఈ రెండు సంస్థల వల్లే మండలంలోని వేలాది ఎకరాలకు, సాగునీరు అందక పంటలు బీటలు వారు తున్నాయన్నారు. ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించి సాగునీటి ఎద్దడిని అరికట్టాలని డిమాండ్ చేశారు.

న్యాయవాదులపై దాడులకు వ్యతిరేకంగా నిరసన

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఇటీవల దేశ రాజధాని ఢిల్లీలో న్యాయవాది హత్య, రాజమండ్రి న్యాయవాదిపై పోలీసులు దాడులకు వ్యతిరేకంగా ప్రతిపాడులో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. అనంతరం న్యాయమూర్తి కాటం భానుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బుగత శివ మాట్లాడుతు పోలీసులు న్యాయవాదిపై దాడి చేసి గాయపరచడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఈ సంఘటనకు కారుకులను కఠినంగా శిక్షించడంతో పాటు న్యాయవాది రక్షణ చట్టాన్ని వెంటనే రూపొందించి అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు ఆడారి సుగుణ, కోశాధికారి ఆర్ వెంకట్రావు, సహాయ కార్యదర్శి రాయి శ్రీనివాసరావు, కల్చరల్ కార్యదర్శి జి సుబ్రహ్మణ్యం, న్యాయవాదులు అవసరాల దేవి, చిట్టంశెట్టి పుల్లయ్య, ఏ కుక్కుటేశ్వర రావు, జోగేష్, సజన, నాగేంద్ర, మల్లేశ్వంరావు, లోవదుర్గ, కాపిశెట్టి శ్రీనివాస్ ఆకుల హరిబాబు ఉన్నారు.


న్యాయమూర్తి భానుకు వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

టిడిపితోనే సంక్షేమ పాలన సాధ్యం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ప్రజా సంక్షేమ పాలన కేవలం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని మాజీ ఎంఎల్ఎ, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వనమాడి కొండబాబు తెలిపారు. వైసిపి పాలనలో ఇదేం ఖర్మ - మన రాష్ట్రానికి ఇదేం ఖర్మ - మన కాకినాడకు కార్యక్రమంలో సోమవారం 27 వ డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జగన్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, సాయిబాబా, కోడూరు కుమారస్వామి (పెద్ద), బుంగా నూకాలమ్మ, అందనాపల్లి శ్రీనివాస్, సూరాడ అప్పారావు, నామాల మల్లి, నాగమణి, కోడూరు ప్రసాద్, దేవి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న అపోలో వైద్యులు

ద్వారంపూడి హయాంలో నగరాభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడలో ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి గడిచిన నాలుగేళ్ల కాలంలో నగరంలో చేసిన అభివృద్ధి శూన్యమని టిడిపి కాకినాడ పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు సుంకర పావని విమర్శించారు. కాకినాడలోని జిల్లా టిడిపి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరులతో సమావేశంలో ఆమె మాట్లాడారు. స్థానిక జగన్నాధపురం లోని ఎన్‌టిఆర్ వారధి కుంగిపోతే ఆ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకు రాకుండా కార్పొరేషన్ ఖజానా నిధులను వినియోగించడం వల్ల కార్పొరేషన్ దివాలా తీసిందని దీనికి ఎంఎల్ఎ ద్వారంపూడి వైఖరియే కారణమని పావని చెప్పారు. టిడిపి ప్రభుత్వ హయాంలో టిడ్కో గృహ సముదాయాన్ని నిర్మిస్తే అది నేటికీ కూడా 1200 మంది లబ్ధిదారులకు అందించడంలో ఎంఎల్ఎ ద్వారంపూడి విఫలం చెందారన్నారు. నగరంలో పేద ప్రజలకు ఇల్లు ఇచ్చానని చెబుతున్న వైసిపి నేతలు అది ఎక్కడ ఇచ్చారో ఆ ఇళ్లపై సంతప్తి చెందామంటూ లబ్ధిదారులతో చెప్పించగలరా అని పావని ప్రశ్నించారు. కాకినాడ నగరంలోని జయలక్ష్మి కోఆపరేటివ్ సొసైటీ చెందిన ఖాతాదారుల భవిష్యత్‌ను అతను పట్టించుకోకపోవడంతో మరో ఇదే తరహా కార్తికేయ బిల్డింగ్ సొసైటీ కూడా దివాలా తీసే దశలో ఉందని ఆమె చెప్పారు. సమావేశంలో చాపల లీలా ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్య ఫార్మసీలో వైద్యశిబిరం

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య కాలేజ్ అఫ్ ఫార్మసీ కళాశాలలో ప్రిన్సిపాల్ డా.కె.రవిశంకర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో అపోలో హాస్పటల్ వైద్యులు ఎం.ప్రవీణ్ కుమార్, ఇ.సుభాష్, శ్రీధర్‌లు మాట్లాడుతూ వేసవి కాలంలో వడదెబ్బ, జ్వరాలు వంటి సంబంధించిన ఆరోగ్య సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురించి వివరించారు బలహీనంగా ఉన్న విద్యార్థులకు ఐరెన్ టాబ్లెట్లు, సిరప్ లను అందించారు. ఎన్. ఎస్.ఎస్. యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు లు పాల్గొన్నారు.

ఎట్టకేలకు భీమోలు రోడ్డుకు మోక్షం

ప్రజాశక్తిగోపాలపురం

భీమోలు నుంచి గోపాలపురం రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించడంతో ప్రయాణులకు ఇబ్బందులకు తెరపడిందని ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. భీమోలు గ్రామం నుండి ప్రజలు గోపాలపురంలోని ప్రభుత్వ కార్యాలయాలకు, నిత్యం పలు అవసరాల నిమిత్తం రావాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ముఖ్యంగా భీమోలు గ్రామంలో అనారోగ్య సమస్యలతో బాధితులు అత్యవసర సమయాలలో ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లేవారు, పలు కార్యక్రమాల నిమిత్తం ప్రజలు ఆ గ్రామం నుండి రావడానికి, తిరిగి ఆ గ్రామం వెళ్లడానికి నరకయాతన పడ్డారని తెలిపారు. ఎట్టకేలకు జిల్లా పరిషత్తు నిధులు రూ.80 లక్షల మంజూరు చేయడంతో 5 కిలోమీటర్లు బీటీ రోడ్డుకు నిర్మాణం పనులు శరవేగంగా జరగడంతో ప్రజలు ఆనందం చేశారు.


వేగంగా సాగుతున్న భీమోలు రోడ్డు నిర్మాణ పనులు

కల్తీ మాంసం విక్రయాలపై చర్యలు

ప్రజాశక్తి- గోకవరం

గోకవరంలో నిల్వ మాంసాలు విక్రయంపై సొసైటీ అధ్యక్షుడు గాజింగం సత్తిబాబు ఆధ్వర్యంలో నిరసన చేపట్టిన నేపథ్యంలో అధికారులు చర్యలు చేపట్టారు. సోమవారం రాజమహేంద్రవరం పశుసంవర్ధక శాఖ డిడి కె.సత్యనారాయణ ఎంపిపి కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు పశుసంవర్ధక శాఖ అధికారులు, సిబ్బంది ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. డిడి సత్యనారాయణ మాట్లాడుతూ మాంసం విక్రయిస్తున్న దుకాణదారులకు ప్రభుత్వం నుండి అనుమతులు పొందిన తర్వాతే మాంస విక్రయాలు జరపాలని తెలిపారు. అనుమతులు లేకుండా మాంసం విక్రయాలు జరిపితే మాంసం అమ్మకం దారులపై చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామపంచాయతీ అధికారులు, పశుసంవర్ధక శాఖ అధికారులు మాంసం ఆరోగ్యకరంగా ఉందని సర్టిపై చేసిన తర్వాతనే మాంసం విక్రయాలు జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు సుంకర వీరబాబు, ఎంపిడిఓ కెవిఎస్ఎస్ఎస్.మూర్తి, పంచాయతీ కార్యదర్శులు, పశుసంవర్ధక శాఖ వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డిడి సత్యనారాయణ

యానాం వార్తలు


పరీక్ష కేంద్రాలను సందర్శించిన ఆర్ఎఐ మునిస్వామి, ఇఐ లక్ష్మణ ప్రవీణ్

పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గంలో పదోవ తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమైన సందర్భంగా పరీక్ష కేంద్రాలను ఆర్ఎఐ మునిస్వామి విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్ సందర్శించారు. మొత్తం మూడు కేంద్రాలలో 693 మంది హాజరవ్వాల్సి ఉండగా 686 మంది విద్యార్థిని విద్యార్థులు హాజరయ్యారని,ఏడుగురు పరీక్షకు గైరాజరయ్యారని విద్యాశాఖాధికారి లక్ష్మణ ప్రవీణ్ తెలిపారు.


బాల్ బ్యాండ్‌మెంటన్ విజేతలు

బాల్ బ్యాడ్మింటన్‌లో తృతీయ స్థానం

-స్టార్ ఆఫ్ ఇండియా అవార్డు గ్రహీత చిన్ని కృష్ణ

మహారాష్ట్ర మూర్తి జాపూర్ లో సోమవారం జరిగిన 67వ జూనియర్ నేషనల్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలలో పుదుచ్చేరి బాలుర విభాగంలో యానాం బాల్ బ్యాడ్మింటన్ క్లబ్ నుండి మహారాష్ట్ర జట్టుపై అత్యంత ప్రతిభ కనబరిచి తృతీయ స్థానం సాధించినట్లు క్లబ్ సెక్రటరీ కాపగంటి ఆదర్శ శేష సుమన్ సోమవారం తెలిపారు. అదేవిధంగా డబుల్స్, మిక్స్ డబుల్స్ బాలుర విభాగంలో తృతీయ స్థానం కైవాసం చేసుకున్నట్లు తెలిపారు.పెసింగి చిన్నికృష్ణ అనే క్రీడాకారుడు స్టార్ ఆఫ్ ఇండియా అవార్డును గెలుచుకున్నాడని హర్షం వ్యక్తం చేశారు. క్రీడాకారులకు సహకరించిన కోచ్ బట్ట శ్రీనివాస్, క్రీడాకారులు కర్రీ రమ్య తేజశ్రీ, కాపు అనూష, చింతా వాసు,కర్రీ రాఘవేంద్ర వర్మ, మహ్మద్ జాఫర్ అలీ, జగడం ప్రవీణ్ కుమార్‌లను ఆయన అభినందించారు.